క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జీఎం చావునీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. నీలం సెంటర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. జోరాబీ దర్గా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు. అబిద్ అలీ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అఫ్జల్‌గంజ్‌లో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఫైర్ స్టేషన్, పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గురుద్వారా, రామ్ మందిర్, రాకేష్ పీటీ, అమృత్ బార్, పత్థర్ మజీద్, పుత్లీబౌలీ చౌరస్తా, రామ్‌బాగ్ సమాజ్, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, బడేమియా పెట్రోల్ పంప్, సీబీఎస్, కన్నయ్య పాఠశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే 11 కేవీ జాంబాగ్, రంగ్‌మహల్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వసంత్ విహార్, మయూరి హోటల్, వీవీ ఫంక్షన్‌హాల్, మహారాష్ట్ర బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఉస్మానియా మెడికల్ కాలేజీ, బసేరా హోటల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

టీబీ వ్యాధిపై అవగాహన

గోల్కొండ: టీబీ వాధిని సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చని గోల్కొండ తెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్. అనురాధ దేవి అన్నారు. శుక్రవారం గోల్కొండ టీబీ కేంద్రం వారు పాఠశాలలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ కేంద్రం వారు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ కుష్టు వ్యాధిగ్రస్తులకు తమ కేంద్రంలో ఉచితంగా పరీక్షలతో పాటు మందులు కూడా అందిస్తామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంబైకి తరలిన మజ్లిస్ నేతలు



అబిడ్స్: ఈనెల 25, 26వ తేదీలలో ముంబైలో జరిగే మజ్లిస్ పార్టీ మొదటి జాతీయ కాన్ఫరెన్స్‌కు మజ్లిస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. దారుసలాం నుంచి దారుసలాం బ్యాంక్ డైరెక్టర్ ఆలంపల్లి నరేందర్, కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్, మాజీ కార్పొరేటర్ రవియాదవ్, మజ్లిస్ నాయకుడు ప్రవీణ్, నవనీర్ శుక్రవారం తరలివెళ్లారు. శనివారం, ఆదివారం జరిగే జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నట్లు వారు వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గౌలిపురా: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి లబ్ధి చేకూరే విధంగా చూడాలని బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మినాన్ అన్నారు. యాకుత్‌పురా అసెంబ్లీ గౌలిపురా డివిజన్ ఛత్రినాక చౌరస్తాలో బూత్ నంబర్ 37, 38, 39 శక్తి కేంద్రం ఇన్‌చార్జి జమాల్‌పూర్ అశోక్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కష్టపడితే రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ ధీరజ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు జి.రఘుకాంత్, శక్తి కేంద్రం సహ ఇన్‌చార్జి చంద్రమోహన్, భాగ్యనగర్ జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, అసెంబ్లీ కన్వీనర్లు, డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరవింద్ మినాన్

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా తవ్వి వదిలేసిన డ్రైనేజీ గుంత
- అదుపు తప్పి గుంతలో పడిన ఓ ద్విచక్ర వాహనదారుడు
- వెంటనే కాపాడిన వాహనదారులు, స్థానికులు



తవ్వి వదిలేసిన డ్రైనేజీ గుంత

చార్మినార్: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్–9లోని శాలిబండ ఆషా టాకీస్ వద్ద జీహెచ్‌ఎంసీ తవ్వి వదిలేసిన డ్రైనేజీ గుంత ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ మరమ్మతుల నిమిత్తం తవ్విన కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో బుధవారం రాత్రి అటువైపు నుంచి వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదావశాత్తు గుంతలో పడిపోయాడని స్థానిక నాయకుడు మహ్మద్ అహ్మద్ తెలిపారు. వెంటనే స్పందించిన ఇతర వాహనదారులు, స్థానికులు గుంతలో పడిన వాహనదారుడిని పైకి తీసి కాపాడాడన్నారు. ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా మారిన ఈ గుంత మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేసి మూసి వేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.



గుంతలో పడిన ద్విచక్ర వాహనదారుడిని బయటికి తీస్తున్న స్థానికులు

నెలల తరబడి పెండింగ్ పెట్టడం ప్రమాదకరం..



పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, కచ్చామోరీ పనులను పెండింగ్ పెడుతున్నారు. మరమ్మతు పనులను ప్రారంభించిన వెంటనే పూర్తి చేయకపోతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో ఏ మేరకు పనులు జరుగుతున్నాయనే విషయాలను సంబంధిత అధికారులు పరిశీలించడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా కాలయాపన చేస్తున్నారు. రోడ్లపై తీసిన గోతులు ప్రమాదకరంగా మారుతున్నాయి.

– కాశమోని శ్యాంరావు ముదిరాజ్, కందికల్ గేట్ ఉప్పుగూడ

నత్తనడకన మరమ్మతులు..



జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో వారికి తెలియడం లేదు. దీంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. శాలిబండ ఆషా టాకీస్ రోడ్డులో కొన్ని రోజులుగా జరుగుతున్న మరమ్మతు పనుల్లో చాలా జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా తవ్వి వదిలేసిన గుంతలో వాహనదారులు ప్రమాదావశాత్తు పడుతున్నందున వెంటనే పనులను పూర్తి చేయాలి.

– మహ్మద్ అహ్మద్, ఖాజీపురా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కొండ రామచంద్రారెడ్డి

అబిడ్స్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఏవీ.ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కొండా రామచంద్రారెడ్డి అన్నారు. నాంపల్లి కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొండా రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకొని మంచి ప్రయోజకులుగా తయారు కావాలని సూచించారు. పాఠశాల వార్షికోత్సవానికి స్పాన్సర్ చేసి గౌరవ అతిథిగా హాజరైన వాసు గ్రూప్ మెడికల్ డైరెక్టర్ గంగిశెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ.. తాను ఇదే పాఠశాలలో చదువుకొని నలుగురికి సహాయపడుతున్నానన్నారు. ఈ నాటి సభ అధ్యక్షుడు, పాఠశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎం.వివేకన్‌రెడ్డి మాట్లాడుతూ. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా ఎంతో ముఖ్యమని, ఇలాంటి సంస్కృత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ ఉండడం వల్ల విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించగలుగుతారన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి నరేందర్‌రెడ్డి, ఏవీ ఎడ్యుకేషన్ సొసైటీ మెంబర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమ, ప్రమీల సునిత, జ్యోతి, ప్రియా, కవిత, కుర్మయ్య, ప్రవీణ్, వేణు తదితర ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలకు సహకరించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మౌలానా ఆజాద్

అబిడ్స్: మౌలానా ఆజాద్ బహుముఖప్రజ్ఞాశాలి అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ మొహ్మద్ ఎజాజ్ ఉజ్ జమాన్ అన్నారు. శుక్రవారం మౌలానా ఆజాద్ 64వ వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంతిహాజ్, అష్రఫ్ అలీఖాన్, మొహ్మద్ మోయిజ్, సుల్తాన్ మీర్జా తదితరులు పాల్గొన్నారు.



మౌలానా ఆజాద్ వర్ధంతి వేడుకల్లో నాయకులు

రక్తదానం ఎంతో గొప్పది



రక్తదానం చేస్తున్న దావూద్ అక్బారీ

చార్మినార్: అన్ని దానాలలో కన్నా రక్తదానం ఎంతో గొప్పదని హైదరాబాద్‌లోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మొదటి కౌన్సిల్ జనరల్ దావూద్ అక్బారీ అన్నారు. ఇమాం హుస్సేన్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పాతబస్తీ నూర్‌ఖాన్ బజార్‌లో జరిగిన రక్తదానం శిబిరం కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తన రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మీర్ ఫిరసత్ అలీ బాక్రీ, సయ్యద్ అలీ హుస్సేన్ జైదీ, నవీద్ ఇర్ఫాన్, ముస్తఫా సిద్దిఖ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు దేశవ్యాప్త ఆదరణ: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఆదరణ లభిస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మజ్లిస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లతో నేటి నుంచి ముంబైలో ప్రారంభం కానున్న మజ్లిస్ 2 రోజుల జాతీయ సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిహార్, మహారాష్ట్ర నుంచి పార్టీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని, కర్ణాటకలో మున్సిపాలిటీలో మజ్లిస్ అభ్యర్థులు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారన్నారు. మజ్లిస్ జాతీయ భావాలు, సెక్యులర్ విధానాల కారణంగానే ప్రజలు తమ పార్టీని ఆదరిస్తున్నారని అయన అన్నారు. అంతేకాకుండా మజ్లిస్ పార్టీకి బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల మద్దతు లభిస్తుందని ఆయన తెలిపారు. పార్టీ అధినేత ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని అందువల్లే ఆయన దేశంలో దళితులు, మైనార్టీలు, బీసీలపై జరుగుతున్న దౌర్జన్యాలను ఖండిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫరాన్, అజీజ్‌ఖాన్ పఠాన్, అలీమొద్దీన్, రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

ముగిసిన ఉస్మానియా దంత వైద్య విద్యార్థుల ధర్నా

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా దంత వైద్యశాలలో వైద్య విద్యార్థులు రెండు రోజులుగా నిర్వహిస్తున్న ధర్నాను విరమించారు. కోఠిలోని ఉస్మానియా వైద్య కళాశాలలోని వసతీ గృహం ఖాళీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో గురువారం ఉదయం నుంచి తరగతులను బహిష్కరించి ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం వరకు ధర్నా కొనసాగగా, ఉన్నతాధికారుల సూచనల మేరకు దంత కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని లిఖిత పూర్వత హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు. తమ డిమాండ్లను పూర్తిగా నేరవేరుస్తామని హామీ ఇచ్చారని, లేని పక్షంలో మళ్లీ ధర్నాకు దిగుతామని పలువురు విద్యార్థులు తెలిపారు.

‘తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే’

గోల్కొండ: తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. అమర్ సింగ్ అన్నారు. గుడిమల్కాపూర్‌లో ‘ప్రజాగోస బీజేపీ భరోసా’ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిర్వహించిన ప్రజా సంగ్రామ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించిందని, బీజేపీకి పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శమన్నారు. ఒకే కుటుంబ పాలనతో ప్రభుత్వం భ్రష్టుపట్టిందని, సీఎం కేసీఆర్‌ను ప్రజలు నియంతా అని పిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జి రామకృష్ణ, బూత్ అధ్యక్షులు అర్జున్, ఆకాశ్, రాజు, సంతోష్, జయరాజ్, బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్, ఆకుల గోవర్ధన్, కరుణ కుమారి, గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సునీల్‌యాదవ్ తదితరులున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అమర్ సింగ్

రైతులకు సన్మానం

గోల్కొండ: ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని గోల్కొండ బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రావుల మాణిక్ ప్రభు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు రాజ్ కుమార్ చాహెర్ సూచనల మేరకు శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని కూరగాయల మార్కెట్‌లో నమో కిసాన్ సమ్మాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా రావుల మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి రాజేందర్ శర్మ, కార్యదర్శి పల్లికొండ రమేష్, రాజేష్ ముదిరాజ్, రాచర్ల దినేష్, గోదా లక్ష్మీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న రావులమాణిక్ ప్రభు తదితరులు

ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శిగా ఆదిల్ షరీఫ్



ఆదిల్‌షరీఫ్‌ను అభినందిస్తున్న నాయకులు

అబిడ్స్: తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచుకొని జాతీయ స్థాయిలో కార్మికులకు న్యాయం చేయాలన్న దృక్పథంతో తనకు ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శిగా నియమించారని మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు ఆదిల్‌షరీఫ్ అన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఐఎన్‌టీయూసీ 33వ ప్లీనరీ సమావేశంలో జాతీయ కార్యదర్శిగా ప్రకటించారన్నారు. దీనికిగాను ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, దిగ్విజయ్ సింగ్, తారిఖ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు. తనను ఐఎస్‌టీయూసీ జాతీయ కార్యదర్శిగా నియమించినందుకు మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, రామకృష్ణా, రమేష్, మొహ్మద్ ముజీబ్ తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపినట్లు వెల్లడించారు.

పీజీ వైద్య విద్యార్థి ప్రీతికి న్యాయం చేయాలి

సుల్తాన్‌బజార్: పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్య చేసుకునే విధంగా మానసిక వేదనకు, ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థి సైఫ్‌ను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు కోఠి డీఎంఈ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్, సిరివెన్నల మాట్లాడుతూ.. వరంగల్ కేఎంసీలో జరిగిన గిరిజన పీజీ విద్యార్థి ప్రీతి ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించిన విద్యార్థి సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన తెలిసి కూడా బాధ్యతారహితంగా వ్యవహరించిన కేఎంసీ కళాశాల మేనేజ్మెంట్, ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసును సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



సైఫ్‌ను అరెస్టు చేయాలని కోఠి డీఎంఈ ప్రధాన గేటు వద్ద ఏబీవీపీ నాయకుల ధర్నా

‘విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే’



పట్టాలు అందజేస్తున్న వహీద్ అహ్మద్

గోల్కొండ: విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు, ముస్లిం అడ్వొకేట్ ఫోరం రాష్ట్ర చైర్మన్ వహీద్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కుల్సుంపురాలోని శుజా గ్రామర్ స్కూల్ కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ సెర్మనీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పట్టాలు అందజేసి వారికి చదువులు నేర్పిన ఉపాధ్యాయ బృందానికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 32 ఏళ్లుగా విద్యారంగంలో ఎందరో విద్యార్థులు దేశానికి అందించిన ఘనత శుజా గ్రామర్ స్కూల్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ముజఫర్ హుస్సేన్, పాఠశాల సెక్రటరీ కరెస్పాండెంట్ సయ్యద్ ఎహెతాశాక్ ఉద్దీన్ బదర్, ప్రధానోపాధ్యాయురాలు దీనా ఉష్రా, శంషియా తబుస్సుమ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యుద్ధంతో అన్ని దేశాలకు ఆర్థిక నష్టం

దూద్‌బౌలి: ఒక దేశంపై మరో దేశం యుద్ధం చేస్తే అన్ని దేశాలకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని గోల్కొండ ప్రభుత్వ కళాశాల అర్థశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సదానంద్ అన్నారు. శుక్రవారం హుస్సేనీఆలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోషల్, సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు యుద్ధంతో జరిగే నష్టాలను వివరించారు. యుద్ధాలతో ఇరు దేశాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీతా పద్మావతి అధ్యక్షతన వహించారు. అర్థశాస్త్రం విభాగం ఇన్‌చార్జి డాక్టర్ శోభారాణి విద్యార్థులకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సదానంద్

ఈశ్వరీ బాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: ఈశ్వరీ బాయిని నేటి యువ మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు ప్రముఖులు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీ బాయి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా పోరాట యోధురాలు ఈశ్వరీ బాయి 32వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ఆ నాడే ప్రత్యేక తెలంగాణ వాదాన్ని శాసన సభలో వినిపించిన మహోన్నత వ్యక్తి ఈశ్వరీ బాయి అని కొనియాడారు. అనంతరం గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు, సామాజిక వేత్త నర్ర వనజాక్షి, ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ కరుణాదేవికి స్మారక అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరీభాయి మెమోరియల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ రాంచంద్రారెడ్డి, అంబేడ్కర్ దూర విద్యాకేంద్రం డైరెక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో మామిడి హరికృష్ణ తదితరులు

ఐసీఏఐ హైదరాబాద్ బ్రాంచ్ కార్యదర్శి ఎన్నిక

నాంపల్లి: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆఫ్ హైదరాబాద్ బ్రాంచ్ 2023–24 సంవత్సరానికి తన టార్ఫ్ బేరర్లను ప్రకటించింది. శుక్రవారం రెడ్ హిల్స్ ఐసీఏఐ కార్యాలయంలో నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. చైర్మన్‌గా సీఏ మైలవరపు సతీష్‌కుమార్, వైస్ చైర్మన్‌గా రాజాంబాల్, సెక్రెటరీగా సీఏ శరణ్‌కుమార్, కోశాధికారిగా చంద్రబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐసీఏఎస్ఏ చైర్మన్‌గా సీఏ కారుమంచి రామారావు, సహ చైర్మన్ గిర్ధారి లాల్, తోష్నివాల్, ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు దయానివాస్ శర్మ, సీఏ శ్రీధర్, ముప్పాల, ప్రాంతీయ కౌన్సిల్ సభ్యులు సీఏ చిన మస్తాన్, సీఏ నరేష్ చంద్ర గెల్లి, మండవ సునీల్‌కుమార్, సీఏ చెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.



భవిత విద్యా సంస్థలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

సుల్తాన్‌బజార్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భవిత విద్యా సంస్థలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆమె నివాసంలో రాష్ట్రస్థాయి నేతలు వినతిపత్రం అందజేశారు. ఆమె స్పందిస్తూ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియేట్ సెక్రెటరీ, పాఠశాల విద్యా కమిషనర్‌కు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థి జేఏసీ చైర్మన్ ప్రసాద్, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, వైస్ చైర్మన్ వీరన్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు లింగయ్య యాదవ్ ఉన్నారు.

మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, రంగస్థల కళలశాఖ ప్రతి సంవత్సరం మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం జరుపుకుంటుంది. దానిలో భాగంగా జీఎల్.నర్సింహారావు పేరు మీద యువ పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. నాటక రంగంలో వివిధ రంగాల్లో నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, సెట్ ఇంకా ఇతర సాంకేతిక అంశాల్లో కృషి చేసిన 35 సంవత్సరాల లోపు యువతి, యువకులు ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారికి పోస్టు ద్వారా కాని, స్వయంగా కానీ సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 28-02-2023.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించండి



గోల్కొండ కఠోర హౌస్ వద్ద..

గోల్కొండ: పారిశుధ్య పనుల్లో చిత్తశుద్ధి కొరవడింది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని చెపుతున్న అధికారుల మాటల్లో ఏ మాత్రం వాస్తవం లేదని ప్రజలు అంటున్నారు. బస్తీల రోడ్లపై పేరుకుపోతున్న చెత్తనే నిదర్శమని వారు అంటున్నారు. పేరుకుపోతున్న చెత్త కుప్పలతో తమకే కాక వీధి జంతువులకు కూడా ప్రమాదం పొంచి ఉందని పలువురు అంటున్నారు. చెత్త కుప్పల వద్ద మూగజీవాలు చేసి చెత్తను మేస్తున్నాయి. ఆవులు, వాటి దూడలు, మేకలు, వీధి కుక్కలు సైతం చెత్త కుప్పల వద్ద చేరి వాటిలోని వ్యర్థాలను మేస్తున్నాయి. దీనివల్ల మూగజీవాల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. చెత్తను ఎప్పటికప్పుడు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పారిశుధ్య అధికారులను కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చార్మినార్: డిజిటల్ టెక్నాలజీని అడ్డం పెట్టుకొని అనేక మంది ఫొటో మార్ఫింగ్‌లకు పాల్పడి మహిళలు, అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్నారని.. అలాంటి ఆకతాయిలను ధైర్యంగా ఎదుర్కొని చెక్ పెట్టాలని ఉస్మానియా ఆస్పత్రి వైద్యురాలు, వి ఫర్ విమెన్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రతిభాలక్ష్మి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల చరిత్ర విభాగం, ఎన్ఎస్ఎస్, డబ్ల్యూసీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ డిజిటల్ యుగంలో ఫొటో మార్ఫింగ్ వేధింపులు ఎక్కువయ్యాయని.. బాధితులకు అవి మరణశాసనాలు రాస్తున్నాయన్నారు. వీలైనంత వరకు సామాజిక మాధ్యమాల్లో తమ వ్యక్తిగత ఫొటోలను పెట్టకపోవడమే మంచిదన్నారు. విద్యార్థులంతా సైబర్ నేరాలకు, ఫొటో మార్ఫింగ్ నేరాల పట్ల ప్రజలలో అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇదే కార్యక్రమంలో ప్రాణదాత పేరుతో మన చుట్టు పక్కల ఎవరైనా గుండెపోటు, పాముకాటు, మూర్ఛ, విద్యుత్ షాక్, అగ్నిప్రమాదం, రోడ్డు ప్రమా దం వంటి ఆపదలో చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్స తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మార్చి 1న రాష్ట్ర కార్యవర్గ సమావేశం

నాంపల్లి: రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం మార్చి 1న నిర్వహిస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్‌హుస్సేన్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కూకట్‌పల్లిలోని సర్దార్ పటేల్‌నగర్ సామాజిక హాల్ వేదికగా సమావేశం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ పటిష్టత గురించి ప్రణాళిక రచించడం, క్షేత్రస్థాయి వరకు పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను తీసుకెళ్లడం, రాష్ట్ర స్థాయి నుంచి మండలం వరకు కమిటీలు వేయడం తదితర అంశాల గురించి చర్చిస్తామని ఆయన వెల్లడించారు. ముఖ్యఅతిథిగా జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ లాల్ పాటిల్ విచ్చేసి పార్టీ శ్రేణులను దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.